సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 8 । జనవరి । 2023



ధనం.. ధాన్యం
జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చకచకా జరుగుతున్నాయి. డబ్బులు కూడా అందుతున్నాయి. - IIలో



ముగిసిన స్పోర్ట్స్ మీట్
పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ముగిసింది. శ్రీకాకుళంలో ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. - IIలో

9 వరకు పింఛన్ల పంపిణీ
శ్రీకాకుళం పాతబస్టాండ్: పింఛన్లను ఈ నెల 9 వరకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ డీవీ విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన జారీచేశారు. ఇప్పటివరకు అందుకోని పింఛను దారులందరికీ 9లోగా పింఛన్లు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులందరికీ సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పండగ వేళలో పటిష్ట చర్యలు



ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: సంక్రాంతి వస్తున్నందున పట్టణ, గ్రామాల్లో పేకాట, కోడి పందాల శిబిరాలపై దాడులు నిర్వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక శనివారం పోలీసు అధికారులను ఆదేశించారు. అక్రమ మద్యం అమ్మకాలు, కల్తీ మద్యం రవాణాను ముందుగా గుర్తించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

త్వరితగతిన రీవాల్యుయేషన్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రీవాల్యుయేషన్ ఫలితాలు సత్వరం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయంలోని పాలక మండలి సమావేశ మందిరంలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ వర్సిటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఎక్కువగా రీవాల్యుయేషన్ ఫలితాల జాప్యంపై విద్యార్థులు ప్రశ్నించారు. డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షల రీవాల్యుయేషన్ రెండు వారాల్లో విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్‌భాస్కర్, సీడీసీ డీన్ సుజాత, రీవాల్యుయేషన్ డీన్ అనురాధ పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



ప్రాజెక్ట్ టీల్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

అరసవల్లి: కేన్సర్‌పై ప్రజలందరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి సూచించారు. ఏపీ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ ఆదేశాల మేరకు ప్రాజెక్ట్ టీల్ అనే కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేన్సర్ అవగాహన కోసం జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రజలందరికీ అవగాహన కోసం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ తులసి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో ఆదివారం 19 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్ష జరగనుంది. ఈ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు.

నేడు మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి మాస్టర్స్ (35 ఏళ్ల పైబడినవారు) బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2022-23 పోటీలు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియం వేదికగా జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాకు చెంది, 35 ఏళ్ల పైబడినవారంతా పోటీల్లో పాల్గొనవచ్చు. మొత్తం 5 కేటగిరీల్లో పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. పురుషులకు సింగిల్స్, డబుల్స్, మహిళలకు సింగిల్స్, డబుల్స్‌లో, ఇరువురికి మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేయనున్నారు. ఇక్కడ రాణించిన క్రీడాకారులను ప్రొద్దుటూరు వేదికగా ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు జరిగే రాష్ట్ర మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు పంపించనున్నారు. పోటీలకు హాజరయ్యే మాస్టర్ షట్లర్స్‌కు వసతి, భోజన సదుపాయాలను, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు నిర్వహణ కమిటీ ముఖ్య ప్రతినిధులు ఆర్.రాజేంద్రన్, కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్ కుమార్, సంపతిరావు సూరిబాబు తదితరులు తెలిపారు.

సీజనంతా.. చెక్కిలిగింత



పండగకు అమ్మమ్మ ఊరికి వెళ్లడం ఆనవాయితీ. ఇంటికి కొత్త అల్లుళ్ల రాక తప్పనిసరి. ఊరికి బంధువుల రాకపోకలు సర్వ సాధారణం. కానీ ఉద్దానంలో మరో రకం పిలుపు కూడా అందుతుంది. నేస్తం ఇంటికి వచ్చి నోరు తీపి చేసుకువెళ్లడం ఇక్కడి ప్రత్యేకత. పండగ ముందు నేస్తరికం కట్టుకున్న వారు ఒకరింటికి ఒకరు వెళ్లడం, ముువ్వ చెక్కీలతో తమ బంధాలను తీపి చేసుకోవడం ఇక్కడి పల్లెలో అందంగా కనిపించే సన్నివేశం. ఈ నేస్తరికాలే ప్రత్యేకమైతే బహుమతిగా ఇచ్చే చెక్కీలు ఇంకా ప్రత్యేకం. ధాన్యలక్ష్మి ఇంటికి వచ్చే ధనుర్మాసంలో తయారు చేసే ఈ వంటకమంటే ఉత్కళాంధ్రులకు ప్రాణప్రదం. అందుకే ఈ సీజనంతా ఉద్దానం వాసులకు 'చెక్కి'లిగింతే.

SUNDAY SPECIAL



వివిధ ఆకృతుల్లో అమ్మకాలకు సిద్ధంగా ఉన్న ముువ్వ చెక్కీలు

- సంక్రాంతి వరకు ముువ్వ చెక్కీల తయారీ
- ఉత్కళాంధ్రుల ప్రత్యేక వంటకం
- బరంపురం చెక్కీలకు భలే గిరాకీ

ఇచ్ఛాపురం రూరల్:

వారు బంధువులు కారు.. కానీ ఆత్మబంధువులు. రక్త సంబంధం లేకపోయినా తరతరాలుగా కుటుంబంతో పెనవేసుకుపోయి ఉంటారు. వారే నేస్తాలు. ఒక్కసారి నేస్తరికం కడితే ఇక బతుకంతా పేరుతో పిలిచే పని లేదు. నేస్తం అని పిలిస్తే చాలు గుండె దానికదే స్పందించేస్తుంది. ఉత్కళాంధ్రులు అపురూపంగా పెంచి పోషిస్తున్న సంప్రదాయమిది. సంక్రాంతికి ఉద్దానంలో నేస్తాల ఇళ్లకు వెళ్లడం వారి పెట్టిన ముువ్వ చెక్కీని అపురూపంగా ఆరగించడం, బంధాన్ని బలోపేతం చేసుకోవడం బతుకంతా దాచుకునే జ్ఞాపకాలు. ఈ జ్ఞాపకాలకు తీపిని అద్దే వంటకమే ముువ్వ చెక్కీ. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించిన రోజున ఉత్కళాంధ్రులు నెల గంటను వేస్తారు. అంటే ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా మకర సంక్రాంతి వరకు 'దొన్ను చెక్కీ'ని ప్రతి రోజూ విష్ణుమూర్తి ఆలయాల్లో దేవునికి నైవేద్యంగా సమర్పిస్తారు. ధనుర్మాసం ప్రత్యేకంగా తయారు చేసే ఈ మిశ్రమ వంటకాన్ని 'ధనుర్మువ్వ' అని కూడా పిలుస్తారు. దీన్నే అన్ని ప్రాంతాల వారు ముువ్వ చెక్కీ, నెయ్యి చెక్కీ అంటారు.

పిలుపు ఎవరికైనా.. బహుమతి ఇదే..

సంక్రాంతి సందర్భంగా అందరికీ పిలుపులు అందుతుంటాయి. ఇంటికి వచ్చేది ఎవరైనా వారికి మర్యాద మాత్రం ముువ్వ చెక్కీతోనే. తొలిసారిగా అల్లుడు, కూతుళ్లకు సంక్రాంతికి పిలుపు చేసేందుకు వెళ్లే సమయంలో మర్యాద పూర్వకంగా శీతాకాలంలో ప్రత్యేకంగా తయారుచేసే ఈ ముువ్వ చెక్కీ వంటకాన్ని తల్లిదండ్రులు, సోదరులు తీసువెళ్తారు. ఈ మిఠాయి మాదిరి తమ కుమార్తె, అల్లుడు జీవితం కూడా పంచదార, పేలాలులా కలసి వారి కాపురం మధురంగా ఉండాలని ఆకాంక్షిస్తారు. జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, పలాసతో పాటు ఒడిశా పాత్రపురం, జయంతిపురం వంటి ప్రాంతాల్లో తయారు చేస్తున్నప్పటికీ బరంపురం చెక్కీకి ఉన్న ప్రత్యేకతే వేరు. దీన్నే అంతా ఇష్టపడతారు. ట్రైన్లలోనూ విక్రయిస్తారు.

విష్ణుమూర్తికి తొలి నైవేద్యం



నెలగంట వేశాక నెల రోజుల పాటు అనగా మకర సంక్రాంతి వరకు విష్ణుమూర్తి ఆలయాల్లో తొలి నైవేద్యంగా ముువ్వ చెక్కీలే సమర్పిస్తాం. ఇవి చాలా ఫేమస్ కూడా. అన్ని షాపుల్లో దొరుకుతాయి.

– తిరునగరి మన్మధరావు సిద్ధాంతి, ఆలయ పురోహితుడు, ఇచ్ఛాపురం మండలం

కొత్త ధాన్యంతో..

పంట చేతికొచ్చి కోతలు, నూర్పులు పూర్తయిన తర్వాత సేకరించిన కొత్త ధాన్యంతో తయారు చేసిన పేలాలతో ఈ ముువ్వ చెక్కీలు తయారు చేస్తారు. ముందుగా ధాన్యంను వేయించి వచ్చిన పేలాలు(నెయ్యిలు)ను వేరు బాణాలో పోసి వాటిలో అప్పటికే సిద్ధం చేసిన వేడి చక్కెర పాకంలో వేసి పేలాలు, యాలకులు, పోపులు, పంచదార పాకం కలగలుపుగా ముద్దగా తయారు చేస్తారు. వివిధ రకాల ఆకృతుల్లో ఉండే చెక్కీల అచ్చుల్లో వీటిని అమర్చి చల్లార్చుతారు. చెక్కీ అందంగా ఉండేందుకు వాటిపై ఎండు కొబ్బరి (కురిడీ) బద్దలను పలుచగా కోసి వాటిపై అందంగా అమర్చుతారు. వాటిపైనే జీడిపప్పు, ఎండు ఖర్జూరం, కిస్‌మిస్, బాదం పప్పును పేర్చుతారు. ఆవు నెయ్యితో తయారు చేసిన చెక్కీలు వందల రూపాయల్లో ఉంటాయి. గట్టి పాకంతో తయారు చేసే ఈ చెక్కీ భద్రంగా దాచిపెడితే ఆరు నెలలు పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. ఇవి కేవలం చలికాలంలోనే తయారవుతాయి. వివిధ ఆకృతుల్లో తయారు చేసే ఈ దొన్ను చెక్కీలు వంద గ్రాముల నుంచి 500 గ్రాముల వరకు, కేజీ, అరకేజీ, పావు కేజీ చెక్కీలు రూ.40 నుంచి రూ.350 వరకు దొరుకుతుండగా, ప్రత్యేకంగా తయారు చేసిన చెక్కీ రూ.500 నుంచి రూ.600లు వరకు ధర పలుకుతోంది.



ఎంఈఓ అప్పారావుకు కానుకగా ముువ్వ చెక్కీని అందజేస్తున్న ఉపాధ్యాయ దంపతులు

స్నేహితునికో బహుమతిగా



సంక్రాంతి వచ్చిందంటే చాలు ముువ్వ చెక్కీలను స్నేహితులకు, యజమానులకు, అధికారులకు కానుకగా ఇవ్వడం ఈ ప్రాంతంలో శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. కొత్త పంట చేతి కొచ్చిన సమయంలో పంట పొలాల్లో కష్టించి పనిచేసిన కూలీలు, రైతులు రాత్రి సమయాల్లో భోజనం చేసి ఈ ముువ్వ చెక్కీని ఆహారంగా తీసుకుంటే ఎలాంటి అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యకరంగా ఉంటారన్న నమ్మకం ఉంది.

– మానుపత్రి వీరాస్వామిరెడ్డి, ఇచ్ఛాపురం మండలం

పర్యాటకం పరుగులు



- అత్యధిక పర్యాటకులు వస్తున్న జిల్లాల్లో సిక్కోలుకు మూడోస్థానం
- ఎక్కువ మంది సందర్శిస్తున్న 100 ఆలయాల్లో అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం
- జిల్లాలో పర్యాటక అభివృద్ధికి చర్యలు
- క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న కన్సల్టెంట్ సూపర్‌వైజర్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సిక్కోలు అందాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది. కన్సల్టెంట్ సూపర్‌వైజర్లతో ప్రస్తుతం పరిశీలన చేయిస్తోంది. కన్సల్టెంట్లు ఇచ్చే నివేదిక ఆధారంగా పర్యాటక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుంది. అత్యధిక పర్యాటకులు వస్తున్న జిల్లాల్లో సిక్కోలు మూడో స్థానంలో ఉంది. రాష్ట్రంలో అత్యధిక భక్తులు వచ్చే 100దేవాలయాల్లో మన జిల్లాకు చెందిన అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలు ఉన్నాయి. దీంతో జిల్లాకున్న ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

మూడు ప్రధాన ఆలయాల వద్ద హెల్ప్ డెస్క్‌లు



భక్తుల తాకిడి దృష్ట్యా అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాల వద్ద హెల్ప్ డెస్క్‌లతో పాటు పలు సౌకర్యాలతో కూడి కంటైనర్‌లను ఏర్పాటు చేయనున్నారు. అందుబాటులో ఉన్న స్థలం మేరకు వాటిని నిర్మిస్తారు. ప్రస్తుతం అరసవల్లిలో నాలుగు సెంట్లు, శ్రీకూర్మంలో 10సెంట్లు, శ్రీముఖలింగంలో 50సెంట్ల స్థలం అందుబాటులో ఉంది. ఆ మేరకు పర్యాటక శాఖ నిర్మాణం చేపట్టనుంది. ఆలయం విశిష్టత పాటు శ్రీకాకుళం జిల్లా, చుట్టు పక్కల ప్రాంతాల విశిష్టతను తెలియజేసేలా హెల్ప్‌డెస్క్ సేవలందించనుంది. కంటైనర్ తరహాలో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. దీంట్లోనే పోలీసు అవుట్ పోస్టు రెస్టారెంట్, సూట్ రూమ్‌లను నిర్మించనున్నారు. అక్కడికొచ్చే భక్తులకు అన్ని రకాలుగా ఉపయోగపడేలా వీటి నిర్మాణం చేపట్టనున్నారు.

తాళ్లపాలెంలో వే సైడ్ ఎమినిటీస్ సెంటర్



జిల్లాలోని ప్రధాన జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తాళ్లపాలెంలో పక్కా సౌకర్యాలతో కూడిన వేసైడ్ ఎమినిటీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన రూపకల్పన చేశారు. అక్కడే పెట్రోల్, డీజిల్ బంక్, ఫుడ్ కోర్టు/రెస్టారెంట్, వెహికల్ పార్కింగ్, బ్యాంకింగ్ సర్వీస్, కాటేజీ తదితర సౌకర్యాలుండే సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు ఆలోచన చేశారు. ఇప్పటికే దానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని కన్సల్టెంట్ సూపర్‌వైజర్లు పరిశీలన కూడా చేశారు.

దిబ్బపాలెం, మత్స్యలేశంలో బీచ్ డెవలప్‌మెంట్



బీచ్ డెవలప్‌మెంట్ కోసం పరిశీలన చేస్తున్న కన్సల్టెంట్ సూపర్‌వైజర్ల బృందం

జిల్లాలోని దిబ్బపాలెం, మత్స్యలేశం బీచ్‌ను కూడా అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. బీచ్ రిసార్టుల నిర్మాణం చేపట్టనున్నారు. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం మెరుగుపర్చనున్నారు. పిల్లల ఆట వస్తువులను అందుబాటులో ఉంచనున్నారు. ఆల్ టర్న్ వెహికల్స్ ఏర్పాటు చేయనున్నారు. బీచ్ పర్యాటకులను ఆకట్టుకునేందుకు అదనపు హంగులు సమకూర్చేలా ప్రతిపాదనలు తయారు చేశారు. వాటిపై కన్సల్టెంట్ టీమ్ వచ్చి పరిశీలన చేయిస్తోంది. ఎక్కడెక్కడ ఏం చేయాలన్న దానిపై ఆరా తీశారు. వీరిచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు 'సాక్షి'కి తెలిపారు.



ఆర్టీసీ రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని దూరప్రాంత సర్వీసులకు వెళ్లే ప్రయాణికులకు ప్రత్యేక రాయితీను ప్రవేశపెట్టారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు పిలుపునిచ్చారు. ఈ బ్యానర్‌ను శనివారం ఆర్టీసీ అధికారులు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు రాను, పోను ఒకేసారి రిజర్వేషన్ చేయించుకుంటే చార్జీలో రూ.10శాతం రాయితీ ఇస్తామని, దూరప్రాంత సర్వీసులకు నలుగురు ఒకేసారి గ్రూపుగా టికెట్ తీసుకుంటే 5శాతం రాయితీ ఇస్తామని, ఈ- వాలెట్ ద్వారా టికెట్ బుక్ చేసుకుంటే 5 శాతం రిజర్వేషన్ ఉంటుందని, వృద్ధులకు 25శాతం రాయితీ ఉంటుందని తెలిపారు.

పది పరీక్షలకు సన్నద్ధం కావాలి: డీఈఓ

గార: పది పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, ఉపాధ్యాయులు ఆ విధంగా ప్రతి పాఠశాలలో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష ఏపీసీ రోణంకి జయప్రకాష్‌లు అన్నారు. శనివారం అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఇరువురు సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. సబ్జెక్టుల వారీగా పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. రికార్డులను, ఇటీవల జరిగిన నాడు- నేడు పనులను పరిశీలించారు. పాఠశాల నుంచి గ్రిగ్స్, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.దయానంద్‌కుమార్, వీవీ రమణమూర్తి, టి.శ్రీనివాసరావు, సీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈఓ పగడాలమ్మ, ఏపీసీ జయప్రకాష్

ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో 9న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 9న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఐటీఐలో శనివారం వివరాలు వెల్లడించారు. ఈ అప్రెంటిస్ మేళాకు మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ప్రతినిధులు హాజరై ఎంపిక చేస్తారని చెప్పారు. ఫిట్టర్-90, ఎలక్ట్రీషియన్ లో 70, ఎలక్ట్రానిక్స్‌లో 30 మందికి అప్రెంటిస్ షిప్ కల్పించనున్నట్లు వివరించారు. నెలకు రూ.12,689 వేతనం కంపెనీ అందిస్తుందని, అప్రెంటిస్ ఏడాది పూర్తి చేసి రెండో ఏడాది కొనసాగితే నెలకు రూ.14,189 అందజేయనున్నట్లు వివరించారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఓటీ వర్తిస్తాయని అన్నారు. శ్యాంక్రిగ్ పిస్టన్ పరిశ్రమ, యునైటెడ్ బేవరేజెస్, ఆంధ్రా ఆర్గానిక్స్ కంపెనీలు ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ ట్రేడులకు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 98499 88879 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అలుగుల అక్రమ రవాణా

- నలుగురు అరెస్టు



కాశీబుగ్గలో పట్టుబడిన అలుగులు ఇవే

కాశీబుగ్గ: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో అరుదుగా దొరికే అలుగులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయ్యింది. అటవీ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. కాశీబుగ్గ సూర్యరాజ్ ఇన్ లాడ్జ్‌లో శనివారం నలుగురు యువకులు రెండు అలుగులను రహస్యంగా బంధించి ఉంచారు. వీటిని ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్న వారికి విక్రయించడానికి బేరాలు జరుగుతున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం రావడంతో మాటు వేసి వేటగాళ్లను పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు, మెళియాపుట్టి మండలానికి చెందిన ఒక యువకుడు, పలాసకు చెందిన ఇద్దరు యువకులు ఉన్నట్లు సమాచారం వచ్చింది. జిల్లా అటవీశాఖ అధికారి నిషాకుమారి ఆదేశాల మేరకు గత రెండు రోజులుగా శ్రీకాకుళం ఎఫ్ఎస్ఓ సాయి, టెక్కలి ఎఫ్ఎస్ఓ బీవీబీ రెడ్డి, కాశీబుగ్గ ఏఎంకె నాయుడు తమ సిబ్బందితో కలిసి వీరిని పట్టుకోవడానికి రంగంలోకి దిగారు. అనుమానితులు లాడ్జిలో ఉన్నారని తెలుసుకుని అలుగులు కొనడానికి మారువేషంలో వెళ్లి బేరసారాలు ఆడి వారిని పట్టుకున్నారు. యలమల సాయి, సవర కోదండరావు, సనపల తులసీ, బమ్మిడి రవితేజలను అరెస్టు చేశారు. అనంతరం వీరిని వన్యప్రాణులను అక్రమ రవాణా చేస్తున్న కేసులో భాగంగా నేరుగా కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అంతరించిపోతున్న జాబితాలో అలుగులు

అటవీశాఖ నియమ నిబంధనల ప్రకారం నాలుగేళ్ల కిందటే ఈ ప్రాణులను అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో చేర్చారు. చైనాలో ఈ జీవులను ఇళ్లలో పెంచుకుంటారు. వీటి శరీరంపై ఉండే పెంకులకు విపరీతమైన గిరాకీ ఉందని ప్రచారం జరుగుతోంది. వీటికి తెలివి కూడా ఎక్కువే. అందుకే సర్కస్‌లలో కూడా వాడుతుంటారు. మెట్ట ప్రాంతాల్లో చీమలను, పురుగులను తింటూ వేగవంతంగా బొరియలు తవ్వి జీవిస్తుంటుంది. అపాయం వస్తే ముడుచుకుపోతుంది. మన జిల్లాలో మహేంద్ర గిరుల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. బయట ఇవి బతకలేవు. అందుకే నాలుగేళ్ల కిందట కేంద్ర అటవీశాఖ షెడ్యూల్-01లో చేర్చింది. దీన్ని వధించినా, అక్రమంగా తరలించినా, అమ్మకాలు జరిపినా శిక్ష తప్పదు.

క్లుప్తంగా

12 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 18 వరకు ఏడు రోజుల పాటు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని డీఈఓ గార పగడాలమ్మ తెలిపారు. సెలవుల్లో పాఠశాలలు తెరిచినా, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర కాలనీకి చెందిన చక్క త్రినాథరావు(63) ఈ నెల 5న రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మురపాక గోవింద శనివారం తెలిపారు. వీఆర్వో శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. త్రినాథరావు కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు శనివారం రాత్రే దహనం చేశారు. త్రినాథరావుకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం


వాసెట్టి దామోదర్(ఫైల్)

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు, స్థానిక ఎంపీటీసీ భర్త వాసెట్టి దామోదర్ (52) ట్రాక్టర్ నుంచి జారిపడి మృతి చెందారు. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామోదర్ తన పొలంలోని ధాన్యం తీసుకురావడానికి శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై వెళ్లారు. అదుపు తప్పి జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన బారువ సామాజిక ఆస్పత్రికి తరలించగా మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వాసెట్టి సుజాత 2013–18 వరకు సర్పంచ్‌గా, ప్రస్తుతం అధికార పార్టీ ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సమన్వయకర్త పిరియా సాయిరాజ్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ బుద్దాన రోహిణి తదితరులు సంతాపం తెలియజేశారు. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

యువశక్తి సభకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

లావేరు: లావేరు మండలంలోని తాళ్లవలస గ్రామం వద్ద ఈనెల 12వ తేదీన జనసేన పార్టీ ఆధ్వర్యంలో యువశక్తి భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వస్తారని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆయన శనివారం తాళ్లవలస గ్రామానికి వచ్చి యువశక్తి సభ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు భరోసా కల్పించి వారిని ఆదుకోవాలన్న ఉద్దేశంతో వివేకానంద జయంతి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సభకు ఎస్పీ అనుమతి ఇచ్చారని తెలిపారు. యువశక్తి కార్యక్రమం కోసం ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకూ ఫోన్ కాల్స్ స్వీకరిస్తే ఇప్పటివరకూ 6వేల మంది కాల్స్ ద్వారా, రెండు వేల మంది ఈమెయిల్స్ ద్వారా ఆసక్తి చూపారని తెలిపారు. కార్యక్రమంలో 100 మంది యువతతో పవన్‌కల్యాణ్ మాట్లాడి వారితో సభలో మాట్లాడిస్తారని పేర్కొన్నారు.

ధనం..ధాన్యం

- రైతుల ఖాతాల్లోకి చకచకా ధాన్యం బిల్లులు జమ
- జిల్లా ఇంతవరకు 23,598 మంది రైతులకు రూ.161 కోట్లు జమ
- ఫలించిన నూతన ధాన్యం కొనుగోలు విధానం
- పండగ ముందే చెల్లింపులపై అన్నదాతల్లో ఆనందం



నివగాం రైతు భరోసా కేంద్రం

కొత్తూరు: అన్నదాత మోమున చిరునవ్వు కనిపిస్తోంది. పండగ రాక మునుపే ధాన్యం డబ్బు చేతికి అంది రావడంతో వారిలో ఆనందం వికసిస్తోంది. ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యంకు సంబంధించి బిల్లులు చకచకా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రభుత్వం చెప్పిన తేదీకి 21 రోజులు ముందుగానే డబ్బులు రైతులకు అందుతున్నాయి. జిల్లాలో ఉన్న 550 రైతు భరోసా కేంద్రాల నుంచి 33,236 మంది రైతుల వద్ద నుంచి 1,81,003 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 23,598 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ. 161 కోట్లు జమ చేసింది. ఈ ఏడాది రైస్ మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకపోవడం వల్ల ధాన్యం విక్రయం రైతులకు సులభమైంది. ఆర్‌బీకేల్లో వలంటీర్ సహకారంతో తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విక్రయించారు. విక్రయించిన ధాన్యం సకాలంలో కేటాయించిన రైస్ మిల్లులకు రవాణా చేయడంతో రైతులకు వేగంగా డబ్బులు అందుతున్నాయి. 80 కిలోల ధాన్యం బస్తాకు రూ.1632లతో పాటు రైతు కల్లం నుంచి రైస్‌మిల్లు వరకు తీసుకువెళ్లేందుకు రవాణా చార్జీలు, గోనె సంచి ధర, కలాసీల చార్జీలతో పాటు మరో రూ. 50లు తో కలుపుకొని ప్రభుత్వం ఇస్తోంది. ప్రస్తుతం ధాన్యం ధరను మాత్రమే చెల్లిస్తోంది. రెండో విడతగా చార్జీల నిమిత్తం ఇస్తున్న రూ.50 కూడా ఇస్తుంది. గతంలో మిల్లర్లు, మధ్యవర్తుల దగ్గర నుంచి గోనె సంచుల వరకు అన్నింటా రైతులకు అన్యాయం జరిగేది. ప్రస్తుతం అలా లేదు. గతంతో పోల్చితో రైతుకు బస్తా దగ్గర రూ.275 అదనంగా లాభిస్తోంది.


బ్యాంకులో తీసుకున్న ధాన్యం నగదుతో రైతు ఉకలాపు తిరుపతిరావు

సంక్రాంతి లోపు చెల్లింపులు..

ఇంత వరకు కొనుగోలు చేసిన ధాన్యంకు రైతులకు సంక్రాంతి లోపు బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రవాణా, గోనె సంచులు, కలాసీల చార్జీలు కలుపుకుని రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నాం.

– పి.జయంతి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్

సంతోషంగా ఉంది..

ధాన్యం అమ్మిన 15 రోజులకే నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేసింది. ఇది చాలా సంతోషంగా ఉంది. ఇలా వేగంగా డబ్బు లిస్తే అప్పులు సకాలంలో చెల్లించేందుకు అవకాశం ఉంది. సంక్రాంతి ముందు ధాన్యం డబ్బులు అందడం సంతోషంగా ఉంది.

– ఉకలాపు తిరుపతిరావు, రైతు, జోగిపాడు, కొత్తూరు మండలం

విశ్వేశ్వరరావు మృతి తీరని లోటు



విశ్వేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

సంతబొమ్మాళి: పదవులతో సంబంధం లేకుండా ప్రజాసేవ చేయడంలో ప్రత్యేకతను కలిగిన పొందల విశ్వేశ్వరరావు(విజయశంకరరావు) మృతి తీరని లోటు అని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యె మోషేన్‌రాజు అన్నారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పొందల విశ్వేశ్వరరావు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాకు ఇన్‌చార్జిగా పనిచేసిన తనకు ఇక్కడి ప్రాంతాలు, నాయకుల గురించి వివరంగా తెలియజేసిన వ్యక్తి విశ్వేశ్వరరావు అని గుర్తు చేసుకున్నాన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామమూర్తి, సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : తీవ్ర నేరాలలో సమగ్ర దర్యాప్తుతో ముందుకు సాగాలని, అపరిష్కృతంగా ఉన్న హత్య, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ, వరకట్నం, మహిళలపై నేరాలు వంటి కేసులను వేగంగా ఛేదించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సబ్ డివిజన్, సర్కిల్ వారీ పోలీసు అధికారులతో పలు కీలకాంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్, పోక్సో, అత్యాచార కేసుల నమోదు, దర్యాప్తు, ఆస్తి నేరాలలో రికవరీ, ముద్దాయిల అరెస్టులపై దృష్టి సారించాలన్నారు. దర్యాప్తులో వెల్లడైన అంశాలు, సాక్ష్యాధారాలు బట్టి దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు, ఫోరెన్సిక్ నిపుణుల ఆధారాల సేకరణ, కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సూచనలు పాటిస్తూ కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. నేరస్తులను గుర్తించేందుకు సాంకేతికతను ఉపయోగించాలన్నారు. ముఖ్య కూడళ్లు, షాపింగ్ కాంప్లెక్సులు, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, దేవాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గస్తీ పెంచాలన్నారు. రాత్రి నిఘా పెంచాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ (క్రైం) టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు మహేంద్ర మాతే, ఎస్.బాలరాజు, సీహెచ్‌వీవీ ప్రసాదరావు, శివరామిరెడ్డి, విజయ్‌కుమార్, వాసుదేవ్, సీఐలు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

సంక్షేమ పథకాలు అందిస్తుంటే తిడతారా?


పింఛన్లు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- చంద్రబాబు, పవన్‌లపై స్పీకర్ తమ్మినేని మండిపాటు
- పేదలకు పింఛన్ల పంపిణీ

పొందూరు: సంక్షేమ పథకాలు అందిస్తుంటే చంద్రబాబు, పవన్ కల్యాణ్, కమ్యూనిస్టులు తిడుతున్నారని, పేదలకు పథకాలు అందించవద్దా? అని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. శనివారం పొందూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నూతన లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు అందించేందుకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పొందూరు మండలంలో 369 పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయని చెప్పారు. ఏపీలో ఇస్తున్న మాదిరిగా తమకూ ఇవ్వాలంటూ కేరళ, ఒడిశా సీఎంలను అక్కడి ప్రజలు అడుగుతున్నారని చెప్పారు. అమరావతిలో పేదలకు, దళితులకు, వెనుకబడిన తరగతులకు వేల ఎకరాలు ఇస్తామంటే, దానికి వ్యతిరేకంగా జెండాను ఎగురవేస్తున్న తొలి కమ్యూనిస్టులుగా చరిత్రకెక్కుతారని విమర్శించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఇంటింటి కుళాయిల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మడ్డువలస కాలువల పనులు పూర్తి చేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. బలసలరేవుకు రూ.97 కోట్లు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా వరకు సుజలస్రవంతిలో భాగంగా రానున్న పోలవరం సాగునీరు మిగులు జలాలను శ్రీకాకుళం జిల్లాలో 70 వేల ఎకరాలకు అందించనున్నట్లు తెలిపారు. దీంతో పొందూరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, సంతకవిటి తదితర మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసే బాధ్యతను సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో 98.7 శాతం హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ రేగిడి లక్ష్మి, నాయకులు కొంచాడ రమణమూర్తి, బాడాన సునీల్, గాడు నాగరాజు, వండాన వెంకటరావు, కిల్లాన సూర్యారావు, కంబాల సూర్యారావు, గుడ్ల మోహన్ పాల్గొన్నారు.

కె.నౌపడ భూములకు ఎకరాకు రూ.26 లక్షలు

- మూలపేట గ్రామస్తుల పునరావాసం కోసం కొనుగోలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మూలపేట గ్రామస్తుల పునరావాసం కోసం కె.నౌపడ గ్రామంలోని భూములను ఎకరా రూ.26 లక్షలకు కొనుగోలు చేసేందుకు ధర నిర్ణయించినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కె.నౌపడ రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని, కె.నౌపడలో పునరావాసం కోసం 54 ఎకరాలు కావాల్సి ఉండగా 34 ఎకరాల భూములను ఒక ఎకరం భూమి రూ.26 లక్షలకు కొనడానికి నిర్ణయించినట్లు తెలిపారు. మిగిలిన భూమిని సేకరణ చేయనున్నట్లు తెలిపారు. మూలపేట గ్రామస్తుల పునరావాసం కోసం కె.నౌపడ గ్రామంలో ఎకరం భూమి రూ.26 లక్షలకు కొనుగోలు చేసినట్లు స్పష్టం చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కొత్తూరు: మండలంలోని మాతల బ్రిడ్జి వద్ద ఈ నెల 5న రూ.1,04,500 విలువైన 27.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఎస్‌ఐ గోవిందరావు, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని స్థానిక ఎంఎల్ఎస్ గోదాముకు అప్పగించినట్లు సీఎస్‌డీటీ రవికుమార్ శనివారం తెలిపారు. కొత్తూరు మండలం కాశీపురం నుంచి ఒడిశా రాష్ట్రం హడ్డుబంగి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. వ్యాన్ డ్రైవర్ నారాయణ, యజమాని పెద్దిన పార్వతీశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గిరిజన ఆశ్రమాల్లో అక్రమాలు

- బుడంబో హెచ్‌ఎం సస్పెన్షన్
- విధుల నుంచి సీఆర్‌టీ తొలగింపు

మందస: గిరిజన ఆశ్రమాల్లో జరుగుతున్న అక్రమాలపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అవకతవకలతో పాటు విద్యార్థినులను వేధింపులకు గురిచేసినట్టు ఆరోపణలు రావడంతో ఐటీడీఏ యంత్రాంగం రహస్యంగా దర్యాప్తు చేపట్టింది. మందస మండలంలో బుడంబో, పట్టులోగాంలో గిరిజన బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలున్నాయి. ఇటీవల బుడంబో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సవర ఆనందరావుపై రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, మెనూ సక్రమంగా పెట్టడం లేదన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఐటీడీఏకు చెందిన పీఆర్‌ఆర్సీ విభాగం ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ యుగంధర్ దర్యాప్తు చేపట్టగా ఆరోపణలు రుజువు కావడంతో పీఓ బి.నవ్యకు నివేదించారు. అంతకుముందు ఇదే ఆశ్రమంలో ఇంగ్లిషు సబ్జెక్టును బోధిస్తున్న పాతపట్నం మండలానికి కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ కె.కుమారరాజు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు ఆరోపణలు రావడంతో ఐటీడీఏ జీసీడీఓ రాములమ్మ దర్యాప్తు చేపట్టారు. నివేదికను పీఓకు అందజేయడంతో చర్యలకు సిద్ధమవుతున్నారు. పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలో గణితం బోధిస్తున్న సీఆర్టీ గోపాల్ కూడా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణల మేరకు ఐటీడీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు. దీనిపైనా పీఓకు నివేదిక అందజేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రాజెక్టు అధికారి సీఆర్టీ గోపాల్‌పై చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఈ విషయమై అసిస్టెంట్ ట్రైబల్ అధికారి మేడిద శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ బి.నగేశ్ ఆధ్వర్యంలో దర్యాప్తులు జరిగాయన్నారు. బుడంబో హెచ్‌ఎం సవర ఆనందరావును ఐటీడీఏ అధికారులు సస్పెండ్ చేశారన్నారు. సీఆర్టీ కుమార్‌రాజును విధుల నుంచి తొలగించామన్నారు. పట్టులోగాం సీఆర్టీ గోపాల్‌పై విచారణ పూర్తయిందని, నివేదిక జిల్లా ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉందన్నారు.

జెమ్స్‌లో అత్యాధునిక ఎమర్జెన్సీ యూనిట్ ప్రారంభం


ఎమర్జెన్సీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక ఎమర్జెన్సీ యూనిట్‌ను చీఫ్ మెంటర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెమ్స్‌ను డీమ్డ్ వైద్య విశ్వవిద్యాలయంగా తీర్చుదిద్దుతానని, ఇందుకు విద్యార్థులు, తల్లిదండ్రుల సహకరించాలని కోరారు. వైద్య విద్యార్థులు క్రమశిక్షణ, వృత్తిపై నిబద్ధత, రోగిని కుటుంబ సభ్యుడిలా భావించడం అలవర్చుకోవాలన్నారు. కళాశాల ఫౌండర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యబృందం జెమ్స్ ఆస్పత్రిలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత మాట్లాడుతూ కళాశాలను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దామన్నారు. ప్రతి విద్యార్థి యూజీ చదివేటప్పుడే పీజీలో సీటు సాధించేలా కృషి చేస్తామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మరాజు మాట్లాడుతూ జిల్లాను క్యాన్సర్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ జెమ్స్ కళాశాల ఆస్పత్రి జిల్లాకే తలమానికమన్నారు. తన కుమార్తెను కూడా ఇక్కడే ఎంబీబీఎస్‌లో చేర్పానన్నారు. అనంతరం వైద్య విద్యార్థులకు వైట్‌కోట్‌ను డాక్టర్ బొల్లినేని భాస్కరరావు చేతులు మీదుగా అందించి ప్రతిజ్ఞ చేయించారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్సు మీట్


క్రీడాకారుడికి పతకం అందజేస్తున్న సూర శ్రీనివాసరావు


స్పోర్ట్సు, గేమ్స్ చాంపియన్‌షిప్ ట్రోఫీలతో విజేతలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల మైదానాల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీకాకుళం ప్రాంతీయ పాలిటెక్నిక్ అంతర కళాశాలల స్పోర్ట్సుమీట్ శనివారంతో ముగిసింది. ఆరు గేమ్స్, 13 స్పోర్ట్సు ఈవెంట్స్‌కు శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని 10 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 435 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో పురుషులు 264 మంది, మహిళలు 171 మంది హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీల్లో పురుషుల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను వెంకటేశ్వర, మహిళల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గెలుచుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి.వి.విద్యాసాగర్ హాజరై ఇతర అతిథులతో కలిసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని, క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జానకిరామయ్య, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఆదిలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, వెంకటేశ్వర విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, విశ్రాంత పీడీలు ఎస్పీ నాయుడు, కేటీ నాయుడు, శివప్రసాద్, విభాగాధిపతి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.